# కబ్ హువా... కైసా హువా?

"ఏ వీడెవడురా?" అన్నారు రెడ్డిగారు మీసాలు నిమురుకుంటూ.

"మా అన్నకొడుకండీ" దూరంగా ఒదిగి నిల్చున్నాడు మా చిన్నాయన. తన చాటున నేను.

"రాములుగాని కొడుకా!"

"అవును దొరా."

"పర్వాలేదే, పనిలోకి పనికొస్తాడే. రేపటి నుంచి మా గొడ్లకాడికి పంపు. రాములుగాని బాకీ యాభై రూపాయలు తీరేదా పెట్టేదా? వీడిని ఒక ఏడాది పనిలోకి పంపితే చెల్లగట్టుకొంటాను."

"ఈడు సదువుకొంటున్నాడు సామీ."

"మీరంతా చదువులకొస్తే మేమంతా చెప్పులు కుట్టుకోవలసిందే. ఎవరి వృత్తులు వారు చేసుకొంటేనే మంచిది."

"చిత్తం."

"మరి వీని మాటేమిటి?"

"నేనేం మీ గొడ్లు కాయను. నేను సదువుకొంటా" అన్నాను బింకంగా.

"ఓరి నీ... జానెడంత లేవు. పొగరు బాగానే ఉందే!"

"తప్పుకాయి దొరా. సిన్నోడు తెలీదు. మా కూలిగింజ లిప్పించండి. ఎంగటేసూ ఇంటికి పా. నీ పని సెప్తా."

ఇంటికి వచ్చాక రెడ్డిగారికి ఎదురు నిలబడి మాట్లాడినందుకు మా అమ్మ, నాయన నన్ను చితకబాదారు. మా ఇంటి వెనుక చింత చెట్టు కింద కూర్చుని ఏడ్చాను. మా పల్లె ఊరికి దూరంగా వుండేది. మొత్తం ఇరవై ముప్పయి గుడిసెలుంటాయేమో? ఇప్పుడో అప్పుడో కూలబోయే మట్టిగోడలు, పెంటకుప్పలు, మురుగు కాలువలు, ఈగలు, దోమలు, చింకి గుడ్డలు, జీబురు తలలు... ఇదీ అక్కడి వాతావరణం.

నన్ను బడికి పంపుతానని నాన్న చెప్పినప్పుడు అమ్మ ఏడ్చి రాగాలు పెట్టింది. "మనోల్లు సదువుకోటమేటి? రెడ్డోరింట్లో పనికేస్తే ఆడి తిండి ఆడు తింటాడు."

"సాల్లేవే. ఆడి బతుకూ మనలాగే నాశనం సేసేదా? అబ్బినంత సదువు అబ్బనీ. తర్వాత చూద్దాం."

బళ్ళో నేను పెద్దింటి పిల్లలతో కలిసి మెలిసి ఉండేవాణ్ణి కాని వాళ్ళ పెద్దల కంట పడకుండా తప్పించుకొనేవాణ్ణి. జీతాల గొడవ లేదు. పుస్తకాలు బడివాళ్ళే ఇచ్చేవారు. సుబ్రహ్మణ్యం మాస్టారికి నేనంటే చాలా అభిమానం ఉండేది. సాయంకాలాలు వాళ్ళింటి దగ్గరే చదువుకొనేవాడిని. ఆయన భార్య మాత్రం నన్ను వరండా దాటి లోనికి రానిచ్చేది కాదు.

నా చదువు మా పల్లెలో వాళ్ళకు హాస్యాస్పదంగా ఉండేది.

"ఇంగిలీసు సదువు యెలగబెట్టున్నాడు ఎంగిటిగాడు."

"రాములుగానికి ఎర్రెత్తింది. సేతికొచ్చిన కొడుకును కూసోబెట్టి ఎనుమును మేపినట్టు మేపుతున్నాడు."

"మనలాంటోల్లకు సదువెందుకు? ఈడేమి గవనోరవుతాడా? కలకటేరా?"

ఎందరు ఏ విధంగా అనుకొన్నా నా చదువు కుంటుపడలేదు. స్కూలు డిబేట్లలో "అస్పృశ్యతా నివారణ" "హరిజనుల సంక్షేమం" "మద్యపాన నిషేధం" వంటి విషయాల గురించి మాట్లాడి ఎన్నో ప్రైజులు తెచ్చుకొన్నాను. అప్పుడప్పుడే నా వారి నీచ స్థితి అర్థంకాసాగింది. మేం పేదలం, అనాగరికులమే కావచ్చు కాని మమ్మల్ని పశువులకంటె హీనంగా ఎందుకు చూస్తారు? అబ్రహాంలింకను బానిస నిర్మూలన, మహాత్మాగాంధి హరిజన సేవ, అంబేద్కర్ మొదలైన పాఠాలు చదివేటప్పుడు నా కళ్ళు చెమర్చేవి. "ఇంకెందరు మహానుభావులు పుట్టాలి?" మా స్థితి మారటానికి అని అనుకొనేవాడిని.

స్కూలు ఫైనలు స్కూలు కంతా ఫస్టుగా పాసయినప్పుడు మా నాన్న ఎంతో సంబరపడ్డాడు. ఏదైనా చిన్న ఉద్యోగం చూపించమని సుబ్రహ్మణ్యం మాస్టారిని కోరాడు.

"ఇప్పుడేం ఉద్యోగం రాములూ? వాడికి నిండా పదహారేండ్లు లేవు. కాలేజీలో చేరనీ."

"మాలాంటోల్లం భరించేమా సామీ?"

"నీకేం కష్టం ఉండదు రాములూ. మీ వానికి జీతం లేదు. పొరుగూరులో కాలేజి. హరిజనులకు హాస్టలుంది. అక్కడ అన్నీ ఉచితంగా సమకూరుతాయి. నీవు భరించేది ఏముంది చెప్పు?"

"ఎంత సెట్టుకంతగాలి. మా లాంటోల్లకు ఇదే గొప్ప."

"అలా అనుకోకూడదు రాములూ. మీ వెంకటేశు చాలా తెలివైనవాడు. పైకి రావలసినవాడు. వాడి భవిష్యత్తు పాడు చేయకు."

నా కాలేజి చదువు ప్రారంభమయింది హాస్టల్లో అందరూ నాలాంటి వాళ్ళే గనుక నాకేం ఇబ్బంది అనిపించలేదు. కాలేజీలో కులాల పట్టింపులు అసలే లేవు. ధైర్యంగా కాలేజి కార్యక్రమాలలో పాల్గొనేవాడిని. రెండేండ్లలో స్టూడెంటు యూనియన్‌కు సెక్రటరీ నయ్యాను. ఆ రోజుల్లో పుస్తకాలు బాగా చదివేవాడిని. ముఖ్యంగా సంఘ సంస్కర్తల పుస్తకాలు మరీ రుచించేవి. ఆదర్శాలు ఒంటబట్టాయి. "కుల మత భేదాలు పోవాలి. సాంఘిక అసమానత తొలగాలి" అని నా వేడి రక్తం ఉద్బోధించేది. నేను పెరిగిన వాతావరణం మీది జుగుప్సకొద్దీ మా ఊరి భూస్వాముల మీద కక్షకొద్దీ మరింత పట్టుదలతో చదివేవాడిని.

బి.ఏ. పూర్తయింది. సెకండు క్లాసులో పాసయ్యాను. ఇంగ్లీషులో రెండు మార్కులతో ఫస్టుక్లాసు తప్పిపోయింది. ఇంచు మించు ఈ నాలుగేండ్లు పొరుగూరులోనే గడిచిపోయాయి. ఎప్పుడైనా సెలవులకు ఇంటికి వెళ్ళినా ఎక్కువ రోజులు గడిపేవాడిని కాదు. నిజం చెప్పాల్సి వస్తే అక్కడ నాకు రోతగా, మనసుకు కష్టంగా తోచేది.

నాకు యం.ఏ. చదవాలని ఉన్నా అది కుదరలేదు. మా నాన్న హఠాత్తుగా పోవటంతో మా అమ్మను చూసుకొనే బాధ్యత నా మీదే పడింది. నేను చదివిన కాలేజీలోనే ట్యూటరు ఉద్యోగం దొరికింది. నా మకాం పూర్తిగా బస్తీకి మారింది. ఎప్పుడైనా మా ఊరివాళ్ళు వచ్చిపోతుండేవారు. వాళ్ళు వచ్చినప్పుడు మాత్రం నాకు చిరాకుగానే ఉండేది. శుభ్రంగా ఉన్న ఇంట్లో తుపుక్కున ఉమ్మేసేవారు. "రేయ్ ఎంగటేసు" అనేవారు. మురికి ఓడే బట్టలు, కంపుగొట్టే శరీరాలు. స్నానాలు చెయ్యండని చెబితే "మనమేం బాపనోల్లమా పొద్దుకు పదిమాట్లు తానాలాడటానికి" అని తెల్ల దుప్పటి కప్పిన నా మంచం మీద కాళ్ళు పారజాపి పడుకొనేవారు. అమ్మ మొఖం చూసి మరేమీ మాట్లాడలేకపోయేవాడిని.

రెండేండ్లు ట్యూటరుగా అనుభవం పొందాక యం.ఏ.ప్రైవేటుగా చదవాలనుకొన్నాను. మా ప్రొఫెసర్‌తో ఆ మాట అంటే "యు ఆర్ ఎ వెరీ ఇంటెలిజెంట్ అండ్ బ్రిలియంట్ యంగ్ మాన్. వై డోన్ట్ యు ట్రై ఫర్ ఐ.ఎ.యస్?" అన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను. "నేనేమిటి? ఐ.ఎ.ఎస్.కు సెలక్టు కావటమేమిటి?"

"నో నో అలా అనకూడదు. మీరు కష్టపడి చదివారంటే తప్పక సెలెక్టవుతారు.

ఐ నో వాట్ స్టఫ్ యూ ఆర్ మేడ్ ఆఫ్. షెడ్యూల్డు కులాలకు ప్రిఫరెన్సు కూడా ఉంది."

ఆయన ప్రోద్బలంతో ఐ.ఎ.ఎస్. వివరాలు తెలిసికొని పుస్తకాలు అవి కొని శ్రద్ధగా చదువు ప్రారంభించాను. ఒక ఏడాదిపాటు నిర్విరామంగా కృషి చేసిన తరువాత అడ్వర్టయిజుమెంటు చూసి అప్లయ్ చేశాను. పరీక్ష వ్రాయటం, ఇంటర్వ్యూలో సెలక్టు కావటం అంతా కలగా జరిగిపోయింది.

నా ఆనందానికి అవధుల్లేకపోయాయి. మా కాలేజీ వాళ్ళు నన్ను పూలమాలలతో ముంచెత్తి వీడ్కోలు చెప్పారు. ఆ ఊరికే కలెక్టరుగా వచ్చి వారి అభ్యుదయానికి పాటుపడాలని ఊరి పెద్దలన్నారు.

మా అమ్మను మా ఊరికే పంపించాలంటే నాకు మనసొప్పలేదు. ఇన్నేళ్ళలో ఆ ఊరిలో ఏ మార్పూ రాలేదని నాకు తెలుసు. కొందరు ముసలాళ్ళు చచ్చిపోయారు. వారి స్థానే వారి పిల్లలు ఊడిగాలు చేస్తున్నారు. వీరి పిల్లలు చీమిడి ముక్కులతో, బానెడు పొట్టలతో, జీబురు తలలతో ఆ మురుగు కాల్వలమధ్య, పెంట కుప్పల మధ్య ఆడుకొంటున్నారు. ఆ వాతావరణంలోకి మా అమ్మను పంపలేక పోయాను. ఆమెను ఈ ఊర్లోనే అద్దె ఇంట్లో వదిలి శిక్షణ కోసం ముస్సోరి చేరుకొన్నాను.

అది నాకు పునర్జన్మ. ముస్సోరి మంచుకొండల్లో, నవనాగరిక ప్రపంచంలో నాలోని అణువణువు పునర్నిర్మాణం పొందింది. మొట్టమొదటగా ఫోర్క్, నైఫ్ పట్టుకొని చుట్టూ నిస్సహాయంగా చూసిన రోజు, మొదటిసారిగా ఉలెన్ సూటు వేసుకొన్నరోజు నేను జీవితంలో మరువలేను. నాలోని రాములుగాని కొడుకు ఎంగటేసు పూర్తిగా చచ్చిపోయాడు. మిస్టర్ వెంకటేశ్ ఐ.ఎ.ఎస్. వెలిశాడు.

నా పోస్టింగ్ మా జిల్లాకే వచ్చినప్పుడు చాలా ఆనందించాను. అధికారం, అవకాశం వుండగా ఆశయాలను అమలులో పెట్టవచ్చుననుకొన్నాను. మా ఊరిప్రజలకు ఎంతో సేవ చేయాలనుకొన్నాను. వారికి ఇండ్లు కట్టించాలని, భూములు పంచిపెట్టాలని వారికి ఒక స్కూలు కట్టించాలని ఇంకెన్నో అనుకొన్నాను.

నల్లగా నిగనిగలాడుతున్న అంబాసిడరు మా ఊరి పొలిమేరలు దాటగానే నా ఒళ్ళు పులకరించింది. మా ఊరి రెడ్డిగారు, పంచాయితీ పెద్దలూ నాకు పూలమాలలు వేశారు. రెడ్డిగారి హాలులో మెత్తని కుర్చీలో కూర్చుని చల్లటి పానీయం సేవిస్తూ వారి పథకాల గురించి విని తల ఊపాను.

"మీ ఊరివాళ్ళం. మమ్మల్ని తమరు దయతలచాలి. మీ ఉద్యోగం మాట విన్నప్పటి నుండి మీ దర్శనం చేసుకోవాలని తహతహలాడుతున్నాం. మీరే

దయతలిచారు" రెడ్డిగారు చేతులు నలుపుకొంటూ చెప్పారు. ఆ పగలు వాళ్ళింట్లోనే విశ్రమించాను. సాయంత్రం గాంధీ మైదానంలో బహిరంగ సభలో మాట్లాడి ఊరి పెద్దలందరితో మా పల్లెవైపు కారు నడిపించాను.

"దీనిని ఇకమీదట అంబేద్కర్ నగర్ అని పిలవాలి."

"అయ్యా అలాగేనండి."

"ఈ రోడ్లు బాగుచేయించాలి."

"తప్పకుండా నండి."

"వీళ్ళకు రెండుగదుల ఇండ్లు కట్టించాలని కూడా అనుకొంటున్నాను."

"దానికే ముందండి. మన కంట్రాక్టరు సత్యమూర్తి రెండు మూడు నెలల్లో దీన్ని మహానగరం చెయ్యడటండీ."

కారు గుడిసెల ముందు ఆగింది. అందరూ చోద్యంగా ఇండ్లముందు నిలుచున్నారు. వాళ్ళలో ఆ పరిసరాలలో ఏ మాత్రం మార్పులేదు. నేను నిల్చోటానికైనా సరయిన స్థలం కన్పించలేదు.

"ఏందిరా గుంపు?" ఒక ముసలాడు వణుక్కుంటూ వచ్చాడు.

"ఈరయ్య మామా నీ అన్న కొడుకొచ్చిండు."

"ఏందేందీ?."

"రాములు గాని కొడుకు."

"ఎంగటేసా? రేయ్ ఎంగటేసూ ఎంతోని వయ్యావురా!" అతను ఏదేదో గొణుగుతూ నన్ను కౌగిలించుకొంటున్నాడు. ముక్కు బద్ధలయ్యే కంపు. ఒంటిపైన వేలాడుతున్న పీలికలు... చుట్టూ ప్రెస్ కెమెరాలు క్లిక్ క్లిక్ మంటున్నాయి. రెడ్డిగారూ, ఊరి పెద్దలూ కాస్త దూరంగా జరిగి నిల్చున్నారు. వాళ్ళ ముఖాల్లో అదేమిటి, అవహేళనా? ఠక్కున వెనక్కి తిరిగి వడివడిగా నా కారు చేరుకొన్నాను. కారును బంగళాకు పోనివ్వమని చెప్పాను.

ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. కుమిలి కుమిలి ఏడ్చాను. దుఃఖం పొర్లుకు వస్తోంది. నా బాధ నాకే అర్థం కాలేదు. దానికి ఒక పేరు లేదు. గుర్తింపు లేదు. ఇదీ అని చెప్పలేని బాధ. ఈ టెనకషన్ తగ్గటానికి ఒక నెల సెలవు పెట్టి ఎక్కడైనా దూరంగా హాయిగా గడిపి రావాలనుకొన్నాను. అప్పుడే బదిలీకి ప్రయత్నించాలని కూడా గట్టిగా నిర్ణయించుకొన్నాను.

23 ఆగస్టు 1974